క్లుప్తంగా

క్రమశిక్షణతో ఉత్తమ పౌరులుగా ఎదగాలి



ఉయ్యూరు: క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉత్తమ పౌరులుగా ఎదగాలని హడ్కో రీజనల్ చీఫ్ డీఎస్ఏ మూర్తి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలకు హడ్కో నుంచి రూ 2 లక్షలు విలువ చేసే టేబుల్స్, బెంచీలు, విద్యా సామగ్రి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్యనిర్దేశనతో విద్యనభ్యసిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహించగలరని చెప్పారు. ప్రభుత్వం, దాతలు సమకూరుస్తున్న వనరులను సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యనభ్యసించాలని సూచించారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్‌లు కె.విజయ్ కుమార్, టీ.శ్రీనివాసబాబు, హెచ్ఎం నాగేశ్వరరావు, ఎస్ఎంసి చైర్మన్ ఆరేపల్లి శివసాయిప్రసాద్, డాక్టర్ విజయేంద్రబాబు, యుటిఎఫ్ నాయకులు టివి రమణ పాల్గొన్నారు.

గర్భిణులకు పోషకాహార కిట్లు పంపిణీ



గన్నవరం:స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో గురువారం రోటరీక్లబ్ ఆఫ్ గన్నవరం శాఖ ఆధ్వర్యంలో 20 మంది గర్భిణులకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జీవీ రవిబాబు, కె.నాగరాజు చేతుల మీదుగా కిట్లను అందజేశారు. తొలుత గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో జి.మంగమ్మ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనిచ్చేందుకు గర్భిణులు మంచి పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని చెప్పారు. స్వచ్ఛందంగా ముందుకువచ్చి గర్భిణులకు పోషకాహార కిట్లను అందజేసిన రోటరీ క్లబ్ కార్యవర్గాన్ని ఆమె అభినందించారు. సీనియర్ రోటేరియన్లు కాసన్నేని బాబురావు, నర్రా సీతారామారావు, గన్నె వెంకట్రావు, సురేష్‌బాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగపద్మావతి, సత్యవణి, పద్మాదేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌స్మార్ట్ మీటర్లను రద్దుచేయాలి



కంకిపాడు: విద్యుత్ స్మార్ట్‌మీటర్లను రద్దు చేయాలని ప్రజావేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు కంకిపాడు పట్టణంలోని పలు వార్డుల్లో స్మార్టు మీటర్లు, విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించాలనే డిమాండ్‌తో కరపత్రాలు పంపిణీ, సంతకాలు సేకరణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ప్రజావేదిక నాయకులు టి.నరేష్ మాట్లాడుతూ సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలను పాలకులు దోచుకుంటున్నారని చెప్పారు. తక్షణమే విద్యుత్ భారాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఉచ్చు నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించాలని, మీటర్లు రద్దు చేయాలని కోరారు. పాత విద్యుత్‌మీటర్లు, పాత రీడింగ్ విధానాన్ని అమలు చేయాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో నాయకులు వి.శివశంకర్, జి.కుమారి, కె.నాంచారయ్య, టీ.దివ్య ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

వరద హెచ్చరిక ఫ్లెక్సీలు ఏర్పాటు

కృష్ణలంక(విజయవాడతూర్పు): వరద ప్రవాహం పెరుగుతున్న దృష్ట్యా కనకదుర్గ వారధి పక్కన రివర్‌ఫ్రంట్ పార్క్ వద్ద అధికారులు వరద ప్రమాద హెచ్చరిక ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కారణంగా కృష్ణా నది పోటెత్తుతోంది. పులిచింతల ప్రాజెక్టు నుంచి ప్రకాశం బ్యారేజీకి సుమారు 3లక్షల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండడంతో బ్యారేజీ అన్ని గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేశారు. నదిలోకి మానవ సంచారం నిషేధించారు.

నెహ్రూనగర్‌లో తీరని డ్రైనేజీ సమస్య!



గుంతలోకి డ్రెయినేజీ నీరు



డ్రెయినేజీలో కదలని నీరు

- రూ.25 లక్షలతో నిర్మాణం
- ఇళ్ల ముందే నిలుస్తున్న మురుగునీరు

పెనమలూరు:ఒకటి కాదు..రెండు కాదు..ఏకంగా రూ.25 లక్షలు నిధులు ఖర్చు చేశారు. అయినా నెహ్రూనగర్‌లో డ్రెయినేజీ సమస్య పరిష్కారం కాలేదు. టీడీపీ నేత కాంట్రాక్టర్‌గా అవతారం ఎత్తి చేసిన నిర్వాకం కారణంగా నేడు నెహ్రూనగర్ వాసులు మురుగునీరుతో అవస్థలు పడుతున్నారు. గోసాల గ్రామ పంచాయతీ శివారు నెహ్రూనగర్‌లో గత కొద్దికాలంగా డ్రెయినేజీ సమస్య ఉంది. మురుగునీరు పారుదల లేక నివాసితులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఇటీవల ఉపాధి హామీ నిధులు రూ. 25 లక్షలతో టీడీపీ నేత ఇక్కడ రోడ్డు కం డ్రెయినేజీ పనులు చేశాడు. నిర్మాణంలో లోపాల కారణంగా డ్రెయినేజీ నీరు పారుదల జరగక ఇళ్ల ముందే మురుగునీరు నిలిచిపోతుంది. పనులు జరుగుతున్న సమయంలోనే సమస్య అధికారులు గుర్తించి ఉండి ఉంటే పరిష్కారమయ్యేది. టీడీపీ నేత పనులు చేయటంతో అధికారులు మౌనం వహించారని స్థానికులు తెలుపుతున్నారు.

సీసీ రోడ్డు పై సీసీ రోడ్డు.....

నెహ్రూనగర్‌లో గతంలో సీసీ రోడ్డు ఉండేది. ఉపాధి పథకం కింద నిధులు రూ.25 లక్షలతో సిమెంట్ రోడ్డు పై మరల సిమెంట్ రోడ్డు వేశారు. దాదాపు 220 మీటర్ల పొడవున 3.3 మీటర్ల వెడల్పుతో రోడ్డు కం డ్రెయినేజీ పనులు చేశారు. నిబంధనల ప్రకారం సిమెంట్ రోడ్డు పై మరల సిమెంట్ రోడ్డు వేయరాదని ఉన్నా అధికార బలంతో టీడీపీ నేత సొమ్ము కోసం రోడ్డు వేశారు. సిమెంట్ రోడ్డు పై సిమెంట్ రోడ్డు వేయటంతో గ్రామంలో ప్రజలు ముక్కున వేలేసుకున్నారు.



డ్రెయిన్ చివరిలో తవ్వి స్థానికుల అభ్యంతరంతో పూడ్చిన గుంత

తీరని డ్రెయినేజీ సమస్య.....

కొత్తగా రోడ్డు కం డ్రెయినేజీ పనులు చేయటంతో నెహ్రూనగర్‌లో డ్రెయినేజీ సమస్య తీరుతుందని స్థానికులు భావించారు. అయితే డ్రెయినేజీ లెవల్స్ సరిగా లేకపోవటం, ఉత్తరం వైపు నీరు పారుదల లేకుండా దక్షిణం వైపునకు వాలు చూపుతూ నిర్మాణం చేశారు. పనులు జరిగిన తరువాత డ్రెయినేజీలో మురుగునీరు పోవటం లేదని గుర్తించిన టీడీపీ నేత (కాంట్రాక్టర్) చివరలో గుంత తవ్వి సిమెంట్ ఒరలు వేసి మురుగు నీరు అందులోకి మళ్లించి చేతులు దులుపుకున్నాడు. అయితే గుంతలో నీరు నిండి పోవటంతో ఇళ్ల మధ్యలోనే మురుగునీరు నిలిచిపోతుంది. పైగా సిమెంట్ ఒరలు వాస్తుకు విరుద్ధంగా వేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీని కారణంగానే స్థానికుడు నాగులా ఇటీవల మృతి చెందాడన్న వివాదం తలెత్తింది. దీంతో గుంతలో వేసిన ఒరలు తొలగించారు. డ్రెయినేజీ సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. ఇప్పుడు మోటర్ ఏర్పాటు చేసి మురుగునీరు తోడి డ్రెయిన్‌లో నీరు బయటకు పంపుతామని అధికారులు, కాంట్రాక్టర్ చెబుతున్నా, ఇలా ఎంతకాలం చేయగలరని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

ఇప్పుడు ఏమి చేస్తారు..?

డ్రెయినేజీ సమస్య పరిష్కారానికి అధికారులు ఇప్పుడు ఏమి చేస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. గుంత తవ్వి డ్రెయినేజీ నీరు మళ్లిస్తే సమస్య పరిష్కారం కాదని, కంకిపాడు ప్రధాన రహదారి వైపునకు డ్రెయినేజీ నీరు పారుదల జరిగే విధంగా మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు. తూతూ మంత్రంగా పనులు చేయటం తగదని స్థానికులు అభ్యంతరం తెలుపుతున్నారు..

ఇవేమి పనులు



రోడ్డు, డ్రెయినేజీ పనులు సక్రమంగా జరగలేదు. ఇళ్ల ముందే మురుగునీరు ఉండి పోతుంది. వాస్తుకు విరుద్ధంగా పనులు చేయటంతో తన సోదరుడు మృతి చెందాడు. అధికారులు వాస్తు విరుద్ధ పనులు చేయకుండా చర్యలు తీసుకోని డ్రెయినేజీ సమస్య పరిష్కరించాలి.

–షేక్.బాజీ, నెహ్రూనగర్, గోసాల

జెండా మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తి





కంకిపాడు: ఈడుపుగల్లు గ్రామం జెండా మహోత్సవానికి ముస్తాబైంది. గ్రామంలోని శ్రీ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ధ్వజస్తంభం జెండా మహోత్సవం శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా ఆగస్టు ఒకటో తేదీన నిర్వహించనున్నారు. ఇందుకు వీరబ్రహ్మేంద్రస్వామి ధ్వజస్తంభాన్ని ప్రత్యేకంగా సిద్ధం చేశారు. విద్యుత్ దీపాలతో అలంకరించారు. శుక్రవారం ఉదయం నుంచే స్థానిక శివాలయంలో ముసునూరు బాల మన్మధరావు, శ్రీలక్ష్మి దంపతుల నేతృత్వంలో ప్రత్యేక పూజలు, జెండా ఆవిష్కరణ మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు.

కొత్తగా 308 పింఛన్‌లు మంజూరు

పెనమలూరు:భర్తలు పింఛన్ తీసుకుంటూ మృతి చెందితే మృతుడి భార్యకు (స్పౌజ్) పింఛన్‌లు కొత్తగా ప్రభుత్వం మంజూరు చేసింది. పెనమలూరు మండలంలో 99, తాడిగడప మున్సిపాలిటీలో 209 చొప్పున మొత్తం 308 పింఛన్‌లు మంజూరు చేశారు. కొత్తగా పింఛన్‌లు మంజూరు అయిన వారికి శుక్రవారం ఆయా సచివాలయాల పరిధిలో పంపిణీ చేస్తారు.

నేడు పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఉంగుటూరు(గన్నవరం): ఉంగుటూరు సబ్‌స్టేషన్ పరిధిలోని తరిగొప్పల ఫీడర్ లైన్ల మరమ్మతల నిమిత్తం శుక్రవారం ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుడివాడ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జీబీ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వెల్దిపాడు, నాగవరప్పాడు, వెన్నూతల, తుట్టగుంటపాడు, వేంపాడు, తరిగొప్పల గ్రామాలకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న ఏటిపాయ



మద్దూరు ఏటిపాయ వద్ద వరదనీటి ఉధృతి



కాసరనేనివారిపాలెంలో ఏటి ఒడ్డున ఉన్న శివాలయం చుట్టూ చేరిన వరదనీరు



మద్దూరు లంక పొలాల నుంచి ఒడ్డుకు పడవలో చేరుతున్న కూలీలు

కంకిపాడు: ఏటిపాయ ఉధృతంగా ప్రవహిస్తోంది. ప్రకాశం బ్యారేజీ నుంచి 2.50 లక్షలు క్యూసెక్కుల వరదనీటిని అధికారులు కృష్ణానది పాయ, కాలువలకు విడుదల చేశారు. దీంతో మండలంలోని మద్దూరు, కాసరనేనివారిపాలెం పరిధిలోని ఏటి పాయ వరదనీటితో ఉధృతంగా పొంగి పొర్లుతోంది. గురువారం మధ్యాహ్నానికి ఏటిపాయ అంచులు నుంచి కరకట్ట వైపు వచ్చే రహదారి వైపు వరదనీరు ప్రవేశించింది. భారీగా వరదనీరు చేరటంతో కాసరనేనివారిపాలెం పరిధిలో ఏటి ఒడ్డున ఉన్న శివాలయం నీట మునిగింది. గర్భాలయంలోకి వరద నీరు చేరింది. వరదనీటి కారణంగా ఏటిపాయ లోపల ఉన్న లంక భూములకు వెళ్లేందుకు రాకపోకలు నిలిచిపోయాయి. అయితే రైతులు, కూలీలు పడవల్లో లంక భూములకు వెళ్లి పొలం పనులు పూర్తి చేసుకుంటున్నారు. ఓ వైపు అధికారులు రాకపోకలు నిషేధం ఉన్నట్లు ప్రకటించారు. కానీ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా నది పాయలో పడవల్లో రాకపోకలు సాగుతున్నాయి.

మత్తు పదార్థాలతో జీవితం అంధకారం

పెనమలూరు:మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలు జీవితాన్ని అంధకారం చేస్తాయని నీతోడు మానసిక వికాసకేంద్రం ప్రతినిధి జాకబ్‌రాజు అన్నారు. యనమలకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో మత్తుపదార్థాల వాడకంపై జరిగే అనర్థాల పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలు జీవితాన్ని దుర్భలం చేస్తాయన్నారు. మొదట్లో మత్తు పదార్థాలు సరదాగా ఉన్న ఆ తరువాత వాటికి బానిసలుగా మారి జీవితాన్ని కోల్పోతారని పేర్కొన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే ఆరోగ్యం దెబ్బతినటమే కాకుండా సమాజంలో కుటుంబాల గౌరవం పోతుందని చెప్పారు. విద్యార్థులు మాదకద్రవ్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాలకు అలవాటుపడిన వారికి సేవలు అందించటానికి ప్రత్యేక సేవా కేంద్రం ఏర్పాటు చేశామని, అవసరం ఉన్న వారు 9490492020 ఫోన్ నెంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎం.శిరీషా, సంస్థ ప్రతినిధులు డి.వెంకటేశ్వరరావు, జె.జ్యోతిచంద్రిక, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కంకిపాడు పాశం లక్ష్మణస్వామి నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న చిన్నారులు, పెద్దలు

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కంకిపాడు: మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని డాన్ బాస్కో నవజీవన్ బాలభవన్ సంస్థ మేనేజర్ ఎండీ వసంతకుమారి తెలిపారు. కంకిపాడు పట్టణంలోని పాశం లక్ష్మణస్వామి నగర్‌లో కెపాసిటీ బిల్డింగ్‌పై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిస్తూ ర్యాలీ చేపట్టారు. భావితరాల భద్రత ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలన్నారు. చిన్నారులు ప్రతి ఒక్కరూ చదువుకోవాలని, లక్ష్యానికి అనుగుణంగా క్రమశిక్షణతో మసలుకోవాలని సూచించారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పతకాల పంట



హనుమాన్‌జంక్షన్ రూరల్:ఆరోగ్యవంతమైన జీవితాన్ని ఆనందంగా గడిపేందుకు వ్యాయామం ఎంతో అవసరమని ప్రముఖ పారిశ్రామికవేత్త, విశ్వ హిందూ పరిషత్ జాతీయ ట్రస్టీ పుట్టగుంట సతీష్‌కుమార్ అన్నారు. స్థానిక విజయవాడరోడ్డులోని పీవై గోల్డ్ జిమ్‌లో శిక్షణ పొంది రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పతకాలు సాధించిన విజేతలను గురువారం పుట్టగుంట అభినందించారు. ఈ నెల 29వ తేదిన గుంటూరు జిల్లా రేవేంద్రపాడులో అమరావతి పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పీవై గోల్డ్ జిమ్ ట్రైనర్లుతో పాటు శిక్షణ పొందిన అభ్యర్థులు కూడా పలు పతకాలను సాధించారు. జిమ్ స్పెషల్ కోచ్ బొల్లిశెట్టి ప్రసన్నకుమార్ వివిధ కేటగిరిల్లో నాలుగు బంగారు పతకాలు, రెండు వెండి పతకాలు సాధించటంతో పాటుగా స్ట్రాంగ్ మెన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ టైటిల్‌ను సొంతం చేసుకున్నారు. ఫిట్‌నెస్ ట్రైనర్ పులకంటి దొరబాబు 93 కిలోల విభాగంలో నాలుగు బంగారు పతకాలు సాధించగా, పరిశ మురళీకృష్ణ మూడు బంగారు పతకాలు, నరహరిశెట్టి లీల శివ అజిత్ మూడు బంగారు పతకాలు, ఒక వెండి పతకం, అల్లాడిశెట్టి జితేంద్ర మూడు వెండి పతకాలను కైవసం చేసుకున్నారు. మహిళల విభాగంలో ఇంకొల్లు సాహితీ మూడు బంగారు, రెండు వెండి పతకాలు సాధించి స్ట్రాంగ్ ఉమెన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ టైటిల్‌ను సొంతం చేసుకున్నారు. సూరపనేని సాయిశ్రీ రెండు బంగారు, రెండు వెండి పతకాలు, డాక్టర్ ఓలేటి లిఖిత నాలుగు బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు. విజేతలతో పాటుగా జిమ్ కోచ్ ప్రసన్నకుమార్‌ను పుట్టగుంట సతీష్‌కుమార్ అభినందించారు. అభయాంజనేయ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ నందిగం వెంకటేశ్వరరావు (స్వామి), లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమాన్‌జంక్షన్ గ్లోబల్ మాజీ అధ్యక్షుడు తాడి రంగారావు, డాక్టర్ కోటే అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూల్‌కు రూ. లక్ష విరాళం



హనుమాన్‌జంక్షన్ రూరల్:స్థానిక ఏలూరురోడ్డులోని అప్పనవీడు జెడ్పీ హైస్కూల్‌కి తమ ఉద్యోగ విరమణను పురస్కరించుకుని ఉపాధ్యాయురాలు మాగంటి అమరావతి రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. పాఠశాల ప్రాంగణంలో ఆమె ఉద్యోగ విరమణ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, గన్నవరం మాజీ ఎమ్మెల్యే దాసరి బాలవర్ధనరావు, స్రవంతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచినేని సత్యప్రసాద్, వేలేరు మాజీ సర్పంచ్ వేములపల్లి శ్రీనివాసరావు, పెదపాడు ఎంఈవోలు నరసింహామూర్తి, రవీంద్ర ఉద్యోగ విమరణ చేసిన ఉపాధ్యాయురాలు అమరావతిని పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఏటా టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందించేందుకు రూ. లక్ష బ్యాంక్ డిపాజిట్ బాండును హెచ్ఎం తోట పుష్పవతికి అమరావతి అందజేశారు. తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు ఆమెను సత్కరించారు.

పూర్వ విద్యార్థుల సౌజన్యంతో కళావేదిక

నేడు ముస్తాబాద జెడ్పీ హైస్కూల్లో ప్రారంభం



ముస్తాబాద హైస్కూల్లో పూర్వ విద్యార్థులు నిర్మించిన నూతన కళావేదిక

గన్నవరంరూరల్: పూర్వ విద్యార్థులు పాఠశాలలకు తరగని సంపద అని ముస్తాబాద జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం నాగవేణి తెలిపారు. 1985–86 సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థులు సౌజన్యంతో నిర్మించిన కళావేదిక శుక్రవారం ప్రారంభిస్తున్నట్లు ఆమె చెప్పారు. మండలంలోని మెట్ట ప్రాంత గ్రామాలు 15 ఉండగా, వాటిలో మేజర్ పంచాయితీ ముస్తాబాద. ముస్తాబాద గ్రామ అభివృద్ధికి 1950 దశకం నుంచి ఈనాటి వరకూ ఆ ప్రాంతం దాతలు నిరంతరం కృషి చేస్తారు. 1949లో ముస్తాబాదకు హైస్కూల్ కావాలని గ్రామస్తులు భవనం కమిటీగా ఏర్పడి సాధించారు. 1950లో హైస్కూల్ నిర్మాణానికి అప్పటి కృష్ణాజిల్లా బోర్డు ప్రెసిడెంట్ కాకాని వెంకటరత్నంచే శంకుస్థాపన చేయించారు. అప్పట్లో గోపవరపుగూడెం, కట్టుబడిపాలెం, ముదిరాజుపాలెం, కొండపావులూరు, ముస్తాబాద, పురుషోత్తపట్నం, సావరగూడెం, సూరంపల్లి, రామచంద్రాపురం, మాదలవారిగూడెం, చనుపల్లివారిగూడెం గ్రామాల విద్యార్థులకు విద్యనందించిన పాఠశాల ఇది. ఈ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు ప్రతి బ్యాచ్ తరచూ కలుస్తూ ఇక్కడ బాగా చదువుకున్న వారికి ప్రోత్సాహకాలు అందిస్తున్నారు.

అదే స్ఫూర్తితో విద్యార్థుల సాంస్కృతిక వికాసం కోసం 1985–86 పదో తరగతి పూర్వ విద్యార్థులు పాఠశాలకు సుమారు 6.5 లక్షలకు పైగా వెచ్చించి కళావేదిక నిర్మించారు. చదువుతో పాటు మాట్లాడే సామర్థ్యం, కళలు, నాటికలు, నాటకాలు వేయడానికి, పాఠశాల కార్యక్రమాల నిర్వహణకు ఈ కళావేదిక ఎంతగానో ఉపయోగపడుతుంది.

అపూర్వంగా కళావేదిక నిర్మాణం



పూర్వ విద్యార్థులు అపూర్వంగా కళావేదిక నిర్మించటం అభినందనీయం. మిగిలిన వారికి స్ఫూర్తిదాయకం. ఈ ప్రాంత దాతల ఔన్నత్యం కొనియాడదగినది. విద్యార్థులకు మరింతగా క్రమశిక్షణ, నాణ్యమైన విద్య అందించేందుకు ప్రేరణ కలుగుతోంది.

–నాగవేణి, హెచ్ఎం, ముస్తాబాద జెడ్పీ హైస్కూల్

విద్యార్థులకు మరిన్ని ప్రోత్సాహకాలు



ఈ పాఠశాలలో గురువుల మార్గనిర్దేశనంలో చదువుకున్నాం. పాఠశాలకు మా వంతుగా 1985–86 పదో తరగతి విద్యార్థులు కళావేదిక నిర్మాణానికి నిర్ణయించి పూర్తి చేశాం. విద్యార్థులను ప్రోత్సహించేందుకు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని భావిస్తున్నాము.

–కందిమళ్ల శ్రీనివాసరావు, సూరంపల్లి, పూర్వ విద్యార్థి